
సాక్షి నాగర్‌కర్నూల్

మంగళవారం । 20 । జూన్ । 2023



ఆధ్యాత్మికోత్సవం

అలంపూర్ జోగుళాంబ ఆలయంలో ఈ నెల 21న ఆధ్యాత్మికోత్సవం నిర్వహించనున్నారు.

వివరాలు 8లో ▸



రసాభాసగా ప్రజాహిత సదస్సు

జడ్చర్ల అభివృద్ధిపై నిర్వహించిన సదస్సు రసాభాసగా మారి అర్ధంతరంగా ముగిసింది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.6 /24.1

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి అల్పాహారంగా రాగిజావ

కందనూలు: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మంగళవారం నిర్వహించే తెలంగాణ విద్యా దినోత్సవం నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా అల్పాహారంగా రాగిజావ అందించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రతిరోజు ప్రార్థనా సమయానికి ముందు విద్యార్థులకు 250 మిల్లీ లీటర్ల రాగిజావను అందించనున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని 'మన ఊరు– మన బడి' 'మన బస్తీ– మన బడి' కింద సకల వసతులతో ఆధునికీకరించిన 65 ప్రభుత్వ పాఠశాలలను మంత్రులు, శాసనసభ్యులు ప్రారంభిస్తారని వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సబ్జెక్టుకు ఒక్కో నోటుపుస్తకం చొప్పున అందించనున్నట్లు డీఈఓ వివరించారు. పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు, సమాచార బదలాయింపు కోసం జిల్లాలోని 609 మంది ఉపాధ్యాయులకు టాబ్‌లను అందించనున్నామన్నారు. మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా మొదటి విడతలో 65 ఉన్నత పాఠశాలల్లో నిర్మితమైన 65 డిజిటల్ తరగతులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

విజయాలు వివరించాలి..

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక పాఠశాలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సభలు, సమావేశాలు నిర్వహించి, ప్రతి పాఠశాలలో ర్యాలీలు నిర్వహించి, జాతీయ పతాకావిష్కరణ, జిల్లా విద్యారంగంలో సాధించిన విజయాలను వివరించాలని డీఈఓ జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు.

నవోదయలో దరఖాస్తుల ఆహ్వానం

బిజినేపల్లి: మండలంలోని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశాలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఐదో తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ జానకిరాములు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అర్హులైన విద్యార్థులు ఎలాంటి రుసుము లేకుండా www.navodaya.gov.in అనే వెబ్‌సైట్‌లో ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు ప్రవేశ పరీక్ష జనవరి 20– 2024లో నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తమ మండలాలు ఏ బ్లాక్‌లోకి వస్తాయో అది ఎంచుకోవాలని, అర్హులైన విద్యార్థులను డీఈఓలు, ఎంఈఓలు, ఎంఐఎస్‌లు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రోత్సహించి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలియజేశారు.

'ధరణి' పోర్టల్‌లో లోపాలు సరిచేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఏఐకేఎస్ సమితి పిలుపులో భాగంగా సోమవారం కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు ధరణి పోర్టల్‌లోని లోపాలను సరిచేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎస్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి వార్ల వెంకటయ్య మాట్లాడారు. రైతులకు ఏక కాలంలో రూ.లక్ష రుణమాఫీ చేయాలన్నారు. 2018 నుంచి నేటి వరకు నాలుగున్నర సంవత్సరాల కాలంలో 42,22,928 మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉండగా.. కేవలం 5,42,679 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కృష్ణాజీ, దాసరి బాలమురళీకృష్ణ, రైతు సంఘం నాయకులు నారాయణ, శ్రీనివాసులు, రామస్వామి, పుల్లయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం

పానగల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా సంఘాల నాయకులు ఐకమత్యంతో పోరాటం కొనసాగించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎండీ.జబ్బార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. ఆయా హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా ఉద్యమాలు కొనసాగించాలన్నారు. ప్రజా సంఘాలు కలిసికట్టుగా వివిధ రూపాల్లో నిరసనలు తెలపాలన్నారు. దీంతోపాటు వివిధ గ్రామాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వేలు నిర్వహించి వాటి పరిష్కారం కోసం ప్రజలతో కలిసి ఉద్యమించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు భగత్, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి దేవేందర్, జంబులయ్య, హనీఫ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ ఏదీ?



కొల్లాపూర్ సమీపంలో భూసేకరణ కోసం హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు(ఫైల్)

- జాతీయ రహదారి 167కే పనులకు అడ్డంకి
- ఏప్రిల్‌లో వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- టెండర్లు పూర్తయినా.. పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్ అనాసక్తి
- పరిహారం చెల్లించకుండా పనులు చేపడితే ఇబ్బందులు ఎదురవుతాయనే భావన



కొల్లాపూర్ సమీపంలో భూసార పరీక్షలు చేస్తున్న నేషనల్ హైవే అథారిటీ సిబ్బంది

నియోజకవర్గాల వారీగా సేకరించనున్న భూములు

కల్వకుర్తి	నాగర్‌కర్నూల్
132 ఎకరాలు	140 ఎకరాలు

కొల్లాపూర్ - 89 ఎకరాలు

కొల్లాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 167కే జాతీయ రహదారి పనులు ముందుకు సాగడం లేదు. ప్రధాని నరేంద్రమోదీ ఈ పనులను వర్చువల్‌గా ప్రారంభించి రెండు నెలలు కావొస్తున్నా.. ఇప్పటి వరకు స్థానికంగా ఎటువంటి పనులు ప్రారంభించలేదు. భూ సేకరణ ప్రక్రియ పూర్తి కాకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. దాదాపుగా ఏడాదిన్నరగా భూసేకరణ ప్రక్రియ కొనసాగుతూ వస్తోంది. దీన్ని పూర్తి చేయడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తుది నివేదిక అందితేనే పరిహారం...

రెవెన్యూ అధికారులు భూసేకరణకు సంబంధించిన పూర్తి వివరాలతో తుది నివేదిక అందించిన తర్వాత పరిహారం చెల్లింపులు జరగనున్నాయి. రెవెన్యూ అధికారులు తుది నివేదికలు అందించకపోవడంతో పరిహారం చెల్లింపుల ప్రక్రియ ఇప్పటివరకు ప్రారంభం కాలేదు.

భూసార పరీక్షలకు అడ్డంకులు...

పనుల కాంట్రాక్టు దక్కించుకున్న ఆర్‌కే కంపెనీ భూసేకరణ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే వారు రోడ్డు నిర్మాణాలకు అవసరమైన వస్తు, సామగ్రిని సిద్ధం చేసుకున్నారు. అండర్ పాసులు, కల్వర్టులు నిర్మించే ప్రాంతాల్లో ఇప్పటికే భూసార పరీక్షలు పూర్తి చేశారు. అయితే కొల్లాపూర్‌తో పాటు కొన్ని చోట్ల రైతులు ఈ పనులను అడ్డుకున్నారు. పరిహారం చెల్లించిన తర్వాతనే తమ భూముల్లో భూసార పరీక్షలు చేసుకోండని చెప్పారు. దీంతో కొన్ని చోట్ల భూసార పరీక్షలను పెండింగ్‌లో ఉంచారు.

టెండర్లు పూర్తయి నాలుగు నెలలు..

నాగర్‌కర్నూల్ జిల్లాలోని కల్వకుర్తి నుంచి నంద్యాల జిల్లాలోని కర్వెన వరకు జాతీయ రహదారి నిర్మించేందుకు భారత్‌మాల పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల కిందట నిధులు మంజూరు చేసింది. కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు మొదటి ప్యాకేజీగా, కృష్ణానదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జిని రెండో ప్యాకేజీగా, సంఘమేశ్వరం నుంచి కర్వెన వరకు మూడో ప్యాకేజీగా పనులను విభజించారు.

- మొదటి విడత పనుల కోసం గతేడాది ఆగస్టు నెలలో రూ.629.96 కోట్ల వ్యయంతో 86 కిలోమీటర్ల మేరకు పనులు చేపట్టేందుకు కేంద్రం టెండర్లను ఆహ్వానించింది. సెప్టెంబర్ వరకు టెండర్ల ప్రక్రియ సాగింది. 2023 ఫిబ్రవరిలో ఈ పనులను ఆర్‌కే ఇన్‌ఫ్రా సంస్థకు కట్టబెట్టినట్లు ప్రకటించారు. 36.33 శాతం తక్కువకు టెండర్‌ను ఆ సంస్థ దక్కించుకుంది. జాతీయ రహదారి పనులను ఏప్రిల్ 8న ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించారు.

భూసేకరణ ఇలా..

జిల్లాలోని మూడు నియోజకవర్గాల వెంట జాతీయ రహదారి నిర్మాణం జరగనుంది. కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో కలిపి 362 ఎకరాల మేరకు భూసేకరణ చేపట్టనున్నారు. అన్ని చోట్ల రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో భూములు కోల్పోతున్న వారు తమ వివరాలను రెవెన్యూ అధికారులకు అందజేశారు. కొల్లాపూర్‌లో బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయే వారి వివరాలతో మార్చి నెలలో పేపర్ నోటిఫికేషన్ ఇచ్చారు. కల్వకుర్తిలో కూడా ఈ ప్రక్రియ దాదాపుగా పూర్తికావొచ్చింది. నాగర్‌కర్నూల్‌లో మాత్రం భూములు కోల్పోతున్న వారి నుంచి అభ్యంతరాలు ఎదురవుతున్నాయి.

తుది నివేదిక రూపొందిస్తాం..



కొల్లాపూర్‌లో జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ చేపట్టాం. ఇప్పటికే రైతులకు నోటీసులు ఇచ్చాం. పత్రికా ప్రకటనలు విడుదల చేశాం. రైతులు వారి భూములకు సంబంధించిన డాక్యుమెంట్లు ఇచ్చారు. దాదాపుగా చివరి దశకు భూసేకరణ ప్రక్రియ చేరుకుంది. అధికారులంతా తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. ఉత్సవాలు ముగిశాక భూసేకరణకు సంబంధించిన తుది నివేదిక రూపొందించి నేషనల్ హైవే అధికారులకు పంపుతాం. – హనుమనాయక్, ఆర్డీఓ కొల్లాపూర్

సంపద వనాలుగా హరితహారం మొక్కలు



కుమ్మెర రిజర్వాయర్ వద్ద మొక్క నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

నాగర్‌కర్నూల్ రూరల్: తొమ్మిది సంవత్సరాల పాటు ప్రతి సంవత్సరం నాటిన హరితహారం మొక్కలు నేడు సంపద వనాలుగా మారాయని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెలంగాణ హరితోత్సవం కార్యక్రమాన్ని నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని కుమ్మెర అంజనీ రిజర్వాయర్ పక్కన 38 ఎకరాల్లో ఏర్పాటు చేసిన సంపద వనాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రిజర్వాయర్ నిర్మాణం పోను మిగిలిన 38 ఎకరాల్లో మొక్కలు నాటుకునేందుకు ఇరిగేషన్ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నారు. అటవీశాఖ, డీఆర్‌డీఓ శాఖల ఆధ్వర్యంలో మూడు ఎకరాల్లో వెయ్యి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మొక్కలు నాటి మాట్లాడారు. హరితహారంలో ఎక్కువగా కష్టపడి మొక్కలు నాటారని, అందుకు ఉపాధిహామీ మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ విశాల్ పాల్గొని మాట్లాడారు. తొమ్మిది ఏళ్లలో హరితహారం కింద జిల్లాలో 7 కోట్ల మొక్కలు నాటామన్నారు. దీంతో జిల్లాలో 7.7 శాతం అటవీ భూభాగం పెరిగిందన్నారు. కార్యక్రమంలో కుమ్మెర సర్పంచ్ శ్రీదేవి, డీఆర్‌డీఓ నర్సింగరావు, అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి, ఏఓ నటరాజు, ఎంపీడీఓ కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజావాణి

నాగర్‌కర్నూల్: ప్రజావాణిలో ఫిర్యాదులు అందజేసిన అర్జీదారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 290 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం దోహదపడుతుందని, సమస్యలను పరిష్కరిస్తే ప్రజావాణిపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని అన్నారు. ప్రజావాణిలో భూ సంబంధిత ఫిర్యాదులు 250 వరకు రాగా అక్కడికక్కడే వాటిని పరిష్కరించారు. జిల్లా అధికారులు విధిగా తప్పనిసరిగా ప్రజావాణికి హాజరుకావాలని, పైఅధికారుల అనుమతి లేనిదే గైర్హాజరు కావొద్దని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, సీపీఓ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో 'సంపద వనాలు'



సింగోటంలో జంతువుల ఫొటో ప్రదర్శన చేస్తున్న కొల్లాపూర్ రేంజర్ శరత్‌చంద్రారెడ్డి

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని ఎల్లూరులో ఫారెస్టు రేంజి ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంపద– వనాలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండి లక్ష్మీదేవమ్మతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం సింగోటంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతి అందజేశారు. అంతకు ముందు విద్యార్థులకు ఫారెస్టులో ఉండే జంతువుల గురించి ఫొటో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమాల్లో లింగాల ఫారెస్టు రేంజర్ వీరేష్ గౌడ్, కొల్లాపూర్ రేంజర్ శరత్ చంద్రారెడ్డి, సింగోటం సర్పంచ్ కష్టయ్య, తదితర అధికారులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన పెంచుకోవాలి

ఎస్పీ మనోహర్



రక్తదాన శిబిరంలో ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ మనోహర్

నాగర్‌కర్నూల్ క్రైం: రక్తదానంతో ఆపదలోని ఎన్నో ప్రాణాలు నిలుస్తాయని, ప్రతిఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ మనోహర్ అన్నారు. యువత రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఎవరైన అత్యవసర సమయంలో రక్తదానం అడిగితే వెంటనే స్పందించి రక్తదానం చేయాలని, రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలు కాపాడినవారమవుతామని అన్నారు. సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 80 మంది వరకు రక్తదానం చేసినట్లు చెప్పారు. అనంతరం రక్తదాతలను అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

హరిత మున్సిపాలిటీగా కల్వకుర్తి



హరిత మున్సిపాలిటీ అవార్డు అందుకుంటున్న చైర్మన్, కమిషనర్

కల్వకుర్తి టౌన్: హరితహారంలో భాగంగా అత్యధిక మొక్కలు నాటి వాటిని సంరక్షించినందుకు గాను కల్వకుర్తి మున్సిపాలిటీ ఉత్తమ మున్సిపాలిటీగా అవార్డు లభించింది. సోమవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరిత దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అవార్డును రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చేతుల మీదుగా మున్సిపల్ చైర్మన్ సత్యం, కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అందుకున్నారు. గతంలో రాష్ట్ర మున్సిపల్ మంత్రి కేటీఆర్ తన ట్విట్టర్ పేజీలో కల్వకుర్తి మున్సిపాలిటీని హరితహారంలో భాగంగా ప్రశంసించారు.


'జగబోయిన్‌పల్లి'కి ఉత్తమ అవార్డు



అవార్డును అందుకుంటున్న జగబోయిన్‌పల్లి సర్పంచ్ కవిత, సెక్రెటరీ హరి

ఊర్కొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహార పథకం ప్రతిపల్లెను పచ్చదనం చేసింది. ఎనిమిదేళ్లుగా నాటిన మొక్కలు పెరిగి పెద్దగయ్యాయి. ప్రతిఏటా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల్లోనూ మొక్కలు నాటి పెంచారు. అయితే ఊర్కొండ మండలంలోని జగబోయిన్‌పల్లికి మాత్రం రాష్ట్రంలోనే ఉత్తమ స్థానం దక్కింది. తెలంగాణ ఉత్సవాల్లో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో జగబోయిన్‌పల్లి సర్పంచ్ ఎలుగొండ కవిత మహిపాల్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ హరికి ఈ ఉత్తమ రాష్ట్ర స్థాయి అవార్డును అందజేశారు. జగబోయిన్‌పల్లి మొక్కల పెంపకంతో పాటు ప్రత్యేకంగా వివిధ పండ్ల మొక్కలతో సుమారు 2,500 మొక్కలతో జీపీలో సంపద వనం ఏర్పాటు చేసినందుకు ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డును అటవీశాఖ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి మహమ్మద్ అలీ, అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కల్వకుర్తి: కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండలం నాగిళ్ల వరకు సాగునీరు అందించాలని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. డి82 ప్రధాన కాల్వ ద్వారా 60 కిలోమీటర్ల వరకు నీరు పారేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లోని పనులు త్వరితగతిన పూర్తి చేసి జూలై చివరి నాటికి సాగునీరు అందించే లక్ష్యంగా పనులు చేయాలన్నారు. కల్వకుర్తి, వెల్దండ, చారకొండ, మాడ్గుల, ఆమనగల్లు మండలాల పరిధిలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటి వరకు చెల్లించేలా చర్యలు చేపట్టామని, మిగిలిన బకాయిలు అతి త్వరగా రైతులకు అందిస్తామని చెప్పారు. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఈఈ శ్రీకాంత్, మధుకాన్ కంపెనీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు పారదర్శకంగా చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కందనూలు: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానాల్లో పని సర్దుబాటు పేరిట చేపడుతున్న డిప్యూటేషన్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.కృష్ణ, యం.శ్రీధర్‌శర్మ డిమాండ్ చేశారు. సోమవారం డీఈఓకు వినతి పత్రం అందించి మాట్లాడారు. ఏడున్నరేళ్లుగా పదోన్నతులు లేక, నాలుగున్నరేళ్లుగా బదిలీలు చేపట్టకపోవడంతో పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. ముఖ్యంగా హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు కలెక్టర్ ఉదయ్‌కుమార్, డీఈఓ గోవిందరాజులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చిన్నయ్య, శ్రీనివాస్, శంకర్, లక్ష్మణ్, గోపి తదితరులున్నారు.

ఆవులను కొనుగోలు చేయొద్దు

తెలకపల్లి: ముస్లింల పండుగ బక్రీద్ ఉన్నందున పశువులను కొనుగోలు చేసి కబేళాలకు తరలించే వ్యాపారులు ఆవులను కొనుగోలు చేయరాదని పశువైద్యాధికారి నాగరాజు యాదవ్ సూచించారు. బక్రీద్ పర్వదినం ఉన్నందున, ప్రతి సోమవారం తెలకపల్లి పశువుల సంతలో ఆవులను కొనుగోలు చేసి కబేళాలకు తరలించరాదని, చట్టప్రకారం నేరమని, వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఆవులను తప్పా.. ఇతర జంతువులను కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. ఈ సోమవారంతో పాటు వచ్చే సోమవారం కూడా సంతలో పర్యటించి వ్యాపారులకు అవగాహన కల్పిస్తామని, ఆవులను కొనుగోలు చేయకుండా చూస్తామని వివరించారు.

మోదీ హయాంలోనే సుపరిపాలన



సమావేశంలో మాట్లాడుతున్న శాంతికుమార్

కొల్లాపూర్: దేశంలో 9 ఏళ్లుగా అధికారంలో ఉన్న మోదీ సర్కారు ప్రజలకు సుపరిపాలన అందించడమే ధ్యేయంగా పనిచేస్తోందని బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ అన్నారు. కొల్లాపూర్‌లోని బీజేపీ కార్యాలయంలో సోమవారం సంయుక్త మోర్చాల సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శాంతికుమార్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. వాటిని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. మోర్చాల వారీగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకుని ప్రజల్లోకి వెళ్లాలన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ప్రణాళికాబద్ధంగా ప్రచారాలు చేపడితే విజయం సాధించవచ్చన్నారు. సమావేశంలో నాయకులు శేఖర్‌గౌడ్, కేతూరి బుడ్డన్న, అన్వేష్, మూలె భరత్‌చంద్ర, రోజారమణి, శశిరేఖ యాదవ్ పాల్గొన్నారు.

దేశ ప్రజల చూపు రాహుల్‌గాంధీ వైపు



కరపత్రాలు విడుదల చేస్తున్న మల్లు రవి, తదితరులు

కల్వకుర్తి: భారత్ జోడో యాత్ర చేపట్టి దేశ ప్రజలందరిని ఐక్యతా రాగంతో ఏకం చేసి దేశ సమైక్యత కోసం బాసటగా నిలిచిన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వైపు దేశ ప్రజలు చూస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లురవి అన్నారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్‌చేసి కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా జూలై 2న నిర్వహించే క్విజ్ పోటీల కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మల్లురవి మాట్లాడారు. యూపీఏతో పాటు దేశంలోని బీజేపీయేతర పక్షాలన్నీ ప్రధానిగా రాహుల్‌గాంధీనే కోరుకుంటున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధిస్తుందని అన్నారు. భారత్ జోడో యాత్ర దేశాన్ని ఏకం చేసిందని చెప్పారు. కార్యక్రమంలో యూసుఫ్ అలీ, విజయ్‌కుమార్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జగన్, గోపాల్, రాహుల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిప్పంటుకొని మహిళ మృతి

ఊట్కూరు: చీరకు నిప్పంటుకుని బాపన్‌పల్లి నారమ్మ(53) మృతిచెందింది. ఈ సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మృతురాలికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం... వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో స్థానికులు గమనించి మంటలు ఆర్పారు. ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందింది. కుమారుడు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ అఫ్జల్ తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. సోమవారం ఉదయం మండలంలోని సంగల శివారులోని నారాయణస్వామి వ్యవసాయ పొలంలో ఓ గుర్తు తెలియని మహిళ(45) మృతిచెందినట్లు స్థానిక రైతులు సమాచారం అందించారన్నారు. సంఘటన స్థలం వద్దకు చేరుకుని మహిళ ప్రమాదవశాత్తు కింద పడి మృతిచెందినట్లు అనుమానం వ్యక్తం చేశారు. అయితే మహిళ బిక్షాటన చేస్తూ.. జీవనం సాగిస్తున్నట్లు అక్కడి రైతులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. సంబంధించిన బంధువులు ఎవరైన ఉంటే సంబంధిత పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

గుట్టల్లో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మహబూబ్‌నగర్ క్రైం: గుట్టలలో ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించింది. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మహబూబనగర్ రూరల్ మండల పరిధిలోని చౌదర్‌పల్లి గుట్టలలో సోమవారం గుర్తు తెలియని మహిళ (55) మృతదేహం లభ్యం అయినట్లు తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన దశలో ఉందని, శరీరంపై ఎలాంటి గాయాలు లేవని, దారి తప్పిపోయి నీరు, ఆహారం లేక మృతి చెంది ఉండవచ్చునని పేర్కొన్నారు. చుట్టు పక్కల గ్రామాల్లో ఎవరైనా వృద్ధురాలు తప్పిపోతే అలాంటి కుటుంబసభ్యులు రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుక్కలదాడి: 15గొర్రె పిల్లలు మృతి



పెబ్బేరు రూరల్: శ్రీ రంగాపురం మండలంలోని జానంపేటలో గొల్ల వెంకటయ్య, రామచంద్రయ్యకు చెందిన 30 గొర్రె పిల్లలను పంట పొలాల్లో ఉంచి గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. 30 గొర్రెపిల్లలపై గ్రామంలోని కుక్కలు దాడి చేయడంతో 15మృతి చెందాయి. మిగతా 15 గొర్రె పిల్లలు గాయపడ్డాయి. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గొర్రెల కాపరులను పరామర్శించారు.

అలంపూర్ కేంద్రంగా ఆధ్యాత్మికోత్సవం

- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 21న ఆధ్యాత్మికోత్సవం
- జోగుళాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు
- జిల్లా వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు



జోగుళాంబ ఆలయం

జోగుళాంబ శక్తిపీఠం: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 21వ తేదీన జోగుళాంబ ఆలయంలో ఆధ్యాత్మికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ప్రణాళికలు రూపొందించినట్లు దేవాదాయ శాఖ జిల్లా నోడల్ ఆఫీసర్ పురేందర్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా బీచుపల్లి, చింతరేవుల, పాగుంట వెంకటేశ్వర స్వామి, మల్దకల్, జమ్మిచేడు జమ్ములమ్మ, సంతాన వేణుగోపాలస్వామి, ధూప, దీప నైవేద్య పథకం కింద ఉన్న ఆలయాల్లో సైతం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో..

పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి వారి ఆలయంలో విద్యుత్ దీపాలంకరణ, పూలంగి సేవతో పాటు, ప్రాథఃకాలం మన్యుసూక్త సహిత పంచామృతాభిషేకాలు మంగళహారతి, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రత్యేక అర్చనలు, మహా నివేదనలు, భక్తులకు ప్రసాద వితరణలు చేయనున్నారు. మల్దకల్ స్వయంభూ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఉదయం 6గంటలకు మూల విరాట్‌కు పంచసూక్తాలతో అభిషేకాలు, 7గంటలకు మూలమంత్ర హోమం, 9గంటలకు ప్రసాద వితరణ, మధ్యాహ్నం 12గంటలకు మంత్రపుష్పం, సాయంత్రం 5 నుంచి 7గంటలకు వరకు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కోలాటం, నృత్య, భజన ప్రదర్శన ఉంటాయి. జమ్మిచేడు జమ్ములమ్మ ఆలయంలో ఆలయాలకు విద్యుత్ అలంకరణ, అమ్మవారికి అభిషేకాలు, విశేష అలంకరణలు, కుంకుమార్చనలు, పల్లకీ సేవలు, కోలాట నృత్యాలు, తీర్థప్రసాద వితరణలు ఉంటాయి. బీచుపల్లి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, వేదపారాయణం, మహా నివేదన, అన్నదానం, రథోత్సవం నిర్వహించనున్నారు. అలాగే పాగుంట వెంకటేశ్వర స్వామి ఆలయంలో అలంకరణలు, భజనలు, అన్నప్రసాద వితరణ ఉంటాయి.

ప్రత్యేక కార్యక్రమాలు..

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంలో ఈనెల 21న ఆధ్యాత్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఆర్జిత సేవలు నిలిపివేసి ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులంతా ఉచితంగా పాల్గొనేందుకు అవకాశం కల్పించినట్లు ఆలయ ఈఓ. పురేందర్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం గోపూజ, ఆలయ పరిక్రమణ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఋత్విక్‌వరణం దశాబ్ది ఉత్సవాల సంకల్పం, అలాగే బాలబ్రహ్మేశ్వరుడికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ఉదయం 8:45 నుంచి ప్రధాన ఆలయం నుంచి పల్లకీసేవలో ఉత్సవ విగ్రహాలను జోగుళాంబ ఆలయానికి సారె, పసుపు, కుంకుమ, పూలు వంటి మంగళ ద్రవ్యాలతో జోగుళాంబ ఆలయానికి చేరుకుంటాయి. అక్కడ అర్ధమండపంలో లక్ష పుష్పార్చనలు, సామూహికంగా లలిత సహస్రనామ పారాయణాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12గంటల తర్వాత మహా నివేదన హారతి, సాయంత్రం 4:30కు జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి శాంతి కల్యాణోత్సవం 6గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కూచిపూడి, భరతనాట్యం, హరికథ, శివతాండవం వంటి అనేక కార్యక్రమాలు ఉంటాయి. ఇదిలా ఉండగా 7గంటలకు గర్భాలయం అమ్మవారికి మహా మంగళహారతి కాగానే మళ్లీ ఆలయ ప్రాంగణంలో కళాకారులకు సత్కారం, ప్రశంసాపత్రాల ప్రదానంతో పాటు ప్రముఖుల ప్రసంగాలు, వేద ఆశీర్వచనంతో పాటు అల్పాహార విందు వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

మహద్భాగ్యంగా భావిస్తున్నాం..

దశాబ్ది ఉత్సవాలలో వివిధ శాఖలలో జరిగే ప్రత్యేక కా ర్యక్రమాలతో పాటు ఆధ్యాత్మికోత్సవ కార్యక్రమం జో గుళాంబ ఆలయంలో జరి గే ప్రత్యేక పూజలు, కార్యక్రమాలలో పాల్గొనడం మహద్భాగ్యంగా భావిస్తున్నాం. దేశ, రాష్ట్ర ప్రజల సంతోషాలను ఆకాంక్షిస్తూ ఆలయాల్లో జరిగే ఈ కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలి.

– వల్లూరు క్రాంతి, కలెక్టర్

అందరూ ఆహ్వానితులే..

జోగుళాంబ ఆలయ కేంద్రంగా అలంపురం నవబ్రహ్మ ఆలయాల్లో 21వ తేదీ ఆధ్యాత్మిక దినోత్స వం సందర్భంగా ఆలయాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నాం. ఆలయంలో ఉద యం నుంచి రాత్రి వరకు జరిగే విశేష కార్యక్ర మాలకు ప్రముఖులతో పాటు అందరూ ఆహ్వానితులే.

– పురేందర్‌కుమార్, జోగుళాంబ ఆలయ ఈఓ. మరియు జిల్లా నోడల్ ఆఫీసర్

ఆలయాల్లో నూతనత్వం..

జిల్లా వ్యాప్తంగా అన్ని ఆలయాలు 21వ తేదీన ఏదో ఒక ప్రత్యేక కార్యక్రమాలతో నూతనత్వం సంతరించుకోబోతున్నాయి. సేవాతత్పరులు ఈ కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేయాలి.

– ఆనంద్ శర్మ, జోగుళాంబ ఆలయ ముఖ్యఅర్చకులు

'కస్తూర్బా'లో పైరవీల జోరు



కస్తుర్బా గాంధీ పాఠశాల

- తాము చెప్పిన విద్యార్థులను చేర్చుకోవాలని ఒత్తిడి
- కాదంటే గొడవకు దిగుతున్న ప్రజాప్రతినిధులు

మరికల్: కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో వారు అనుకున్న విద్యార్థులను చేర్పించడం కోసం ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు జోరుగా పైరవీలు చేస్తున్నారు. విద్యార్థుల టాలెంట్‌ను బట్టి, పేద విద్యార్థులకు మాత్రమే అడ్మిషన్ ఇస్తామని చెబితే నేరుగా ప్రిన్సిపాల్‌తో గొడవకు దిగుతున్నారు. మరికల్ కస్తూర్బా పాఠశాలలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇక్కడ తరగతికి 30 విద్యార్థులు ఉండాలి. కానీ 40 మందిని చేర్చుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే కస్తూర్బా పాఠశాలలో చేరే అవకాశం ఉంది. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులను కూడా కొందరు పైరవీకారులు ఇక్కడ చేర్పిస్తున్నారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు అయితే పదుల సంఖ్యలో విద్యార్థులను చేర్పించేందుకు ప్రిన్సిపాల్‌పై ఒత్తిడి తెస్తున్నారు. సోమవారం మరికల్‌కు చెందిన ఓ ప్రజాప్రతినిధి ముగ్గురు విద్యార్థులను కస్తూర్బాలో చేర్చుకోవాలని ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేశాడు. టాలెంట్ ఆధారంగా ఎంపిక చేస్తామని చెప్పడంతో ఆయన ప్రిన్సిపాల్‌పై తీవ్ర పదజాలంతో ఫోన్‌లో వాదనకు దిగాడు. దీంతో ఆమె కన్నీళ్లు పెట్టుకుంది. అయితే పైరవీకారులు మాత్రం కస్తుర్బాలో మీ పిల్లలకు సీట్లు ఇప్పిస్తామంటూ కొందరితో డబ్బులు వసులు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మిని సంప్రదించగా కస్తుర్బాల్లో చేర్పించిన విద్యార్థుల తల్లిదండ్రులతో పైరవీకారులు డబ్బులు తీసుకున్నట్లు తమ దృష్టికి రాలేదని అన్నారు. ఒకవేళ అలాంటి విద్యార్థులు ఇక్కడ ఉంటే వారి అడ్మిషన్ రద్దు చేస్తామన్నారు. రాజకీయ పార్టీల నాయకులకు సంబంధించిన పిల్లలను చేర్చుకోవాలని ఒత్తిడి తీసుకరావడంతో అర్హులైన పేద విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వలేకపోతున్నామన్నారు.

యువకుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

బల్మూర్: మండలంలోని కొండనాగుల గ్రామానికి చెందిన ఓ యువతిని పెళ్లి పేరుతో వంచించి మోసం చేసిన యువకుడిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శివానందం గౌడ్ తెలిపారు. గ్రామానికి చెందిన పసుపుల ఆంజనేయులు అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి.. ఆమెకు శారీరకంగా దగ్గరై.. ఆ తర్వాత పెళ్లి చేసుకోకుండా మోహం చాటేశాడు. దీంతో బాధితురాలు వారం రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. నిందితుడిని సోమవారం అరెస్టు చేసి అచ్చంపేట కోర్టుకు తరలించారు. జడ్జి నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోల్డ్ స్టోరేజ్‌లో రూ.18 లక్షలు మాయం

- సీసీ పుటేజీ ద్వారా నిందితుల గుర్తింపు

ఉండవెల్లి: కోల్డ్ స్టోరేజీలో వ్యాపారి దాచిన నగదును పక్కా ప్లాన్‌తో కాజేసి పారిపోయిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. ఈ ఘటనకు సంబంధించి ఏఎస్‌ఐ అయ్యన్న, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ కథనం ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా కొమరోలు మండలం గుండ్రేడుపల్లికి చెందిన దూదేకుల చంటిగారి నర్సింహులు మిర్చీ వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో అతను ఈ నెల 17న ఇటిక్యాలపాడు శివారులో రైతుమిత్ర కోల్డ్ స్టోరేజ్‌లో దాదాపు 400 క్వింటాళ్ల మిర్చి కొనుగోలు చేసి ఇందుకు సంబంధించి రూ.18 లక్షల నగదును మేనేజర్ మధుకు ఇచ్చాడు. దీంతో మధు అక్కడే ఉన్న బీరువాలో నగదు దాచి తాళం తన వద్దే ఉంచుకొని.. గది తాళాన్ని మాత్రం యజమాని రామచంద్రుడుకు ఇవ్వాలని వాచ్‌మన్ కమల్ అనే నేపాల్ వ్యక్తికి ఇచ్చాడు. దీనిని గమనించిన కమల్ నగదు కాజేయాలని పథకం పన్ని.. అక్కడే ఉన్న కోల్డ్ స్టోరేజ్ ఆపరేటర్ భాస్కర్‌ను టీ తాగడానికి బయటికి తీసుకెళ్లాడు. కమల్, భాస్కర్ టీ తాగడానికి వెళ్లగా.. పథకం ప్రకారం కమల్ భార్య, నేపాల్‌కు చెందిన మరో ఇద్దరు దంపతులు కలిసి గది తాళం తెరిచి, బీరువాను పగులగొట్టి రూ.18 లక్షలను దొంగిలించి యథావిధిగా గదికి తాళం వేసి అక్కడి నుంచి ముగ్గురు పరారయ్యారు. ఆ తర్వాత భాస్కర్ నిద్రించాక కమల్ సైతం పారిపోయాడు. ఉదయం మధు గదిని తెరిచి చూడగా బీరువాలో ఉన్న డబ్బు దొంగిలించినట్లు గుర్తించి మిర్చి వ్యాపారికి, యజమానికి సమాచారం అందించారు. సీసీ పుటేజ్‌లో పరిశీలించగా వాచ్‌మెన్ కమల్ భార్య, మరో జంట ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై దూదేకుల నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఇసుక డంపుల సీజ్



రంగాపూర్ శివారులో సీజ్ చేసిన ఇసుక డంపు

పెబ్బేరు: మండలంలోని రంగాపూర్ కృష్ణానది తీరంలో అక్రమంగా డంపు చేసిన ఇసుకను సోమవారం పోలీసులు, రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. కొందరు దళారులు కృష్ణానది నుంచి ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలించి సమీపంలో ఉన్న వ్యవసాయ భూముల్లో నిల్వ చేసి రాత్రివేళలో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా వనపర్తి, గద్వాల జిల్లాకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో సుమారుగా 30 ట్రిప్పుల ఇసుక డంపును సమాచారం మేరకు కానిస్టేబుల్ రాములునాయక్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌రావు సీజ్ చేశారు. అయితే మండలంలోని వైశాఖపూర్, రాంపూర్, రంగాపూర్ శివారులో ప్రభుత్వ పనులకు ఒక ట్రాక్టర్ ఒకే టిప్పునకు అనుమతి తీసుకొని అక్రమంగా ఇసుకను అధికారుల కళ్ల ముందే తరలిస్తున్నా పట్టించుకొనే నాథుడే లేడని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జనరల్ ఆస్పత్రిలో వ్యక్తి ఆత్మహత్య



వెంకటస్వామి (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: మానసికస్థితి బాగోలేని ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాగర్‌కర్నూల్‌లోని జనరల్ ఆస్పత్రిలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. పెద్దకొత్తపల్లి మండలం గంట్రావులపల్లికి చెందిన వెంకటస్వామి(55) కొద్దిరోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో ఈ నెల 17న వేపచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. చెట్టు కొమ్మ విరిగి పడటంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే సోమవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు నిదిస్తుండగా ఎవరికీ చెప్పకుండా జనరల్ వార్డు నుంచి కిందకు వచ్చి కిటికీకి తన అడ్డంచెతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి వెంకటస్వామి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వెంకటస్వామికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అప్పుల బాధతో మరొకరు..

పెద్దకొత్తపల్లి: పశువుల వ్యాపారం, కుమార్తె పెళ్లి కోసం చేసిన అప్పులు తీర్చలేక నల్లవెల్లి వెంకట్‌రెడ్డి(40) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం పెరుమాండ్లపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లవెల్లి వెంకట్‌రెడ్డి పశువుల వ్యాపారం చేస్తూ.. జీవనం సాగించేవాడు. ఇటీవల తన కుమార్తె సంధ్య పెళ్లి కోసం చేసిన అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురై సోమవారం 11 గంటల సమయంలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సుమతమ్మ ఇంట్లోకి వెళ్లి చూడగా.. అప్పటికే వెంకట్‌రెడ్డి చనిపోయాడని గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పెద్దకొత్తపల్లి ఎస్‌ఐ రాజు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పశువుల అక్రమ తరలింపుపై కేసు

వెల్దండ: హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ ఖురేషి కల్వకుర్తి, పరిసర గ్రామాల నుంచి అక్రమంగా పశువులను తరలిస్తుంటే వెల్దండ ఎస్‌ఐ శ్రీనివాస్ సోమవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ ఖురేషి కల్వకుర్తి మండలంలోని ఆయా గ్రామాల్లో 17 ఆవుదూడలను వాహనంలో తీసుకుని హైదరాబాద్ వైపు వెళ్తున్నారు. సోమవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ వద్ద హైదరాబాద్– శ్రీశైలం ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీలో పశువులు తరలిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న పశువులను వెల్దండ గోశాలకు తరలించారు. వాహనం డ్రైవర్‌తో పాటు, యాజమానులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఉదండాపూర్..!

ఏళ్లతరబడిగా సా..గుతున్న రిజర్వాయర్ నిర్మాణం

- పునరావాస పనులది సైతం అదే పరిస్థితి
- నిర్వాసితులకు అందని ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ
- ఆందోళన చెందుతున్న గ్రామస్తులు, రైతులు
- సెప్టెంబర్ వరకు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు



ఉదండాపూర్ రిజర్వాయర్ కట్ట

జడ్చర్ల: పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథ కంలో భాగంగా నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజ ర్వాయర్ పనులు నత్తకు నడక నేర్పిస్తున్నాయి. ఒకవైపు ప్రభుత్వం త్వరితగతిన పనులు పూర్తి చేసి రిజర్వాయర్‌ను వరద జలాలతో నింపేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా ఈ ఏడాది సెప్టెంబర్ నెలాఖరు వరకు పనులు పూర్తి చేసేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు. అయితే గడువులోగా పనులు పూర్తయ్యే పరిస్థితి ఏమాత్రం కనిపించడం లేదు.

ఇదీ నేపథ్యం..

పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలతో ఉమ్మడి పాలమూరుతోపాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు సాగునీరు అందించాలన్న ప్రధాన ఉద్దేశంతో చేపట్టిన ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ వద్ద 15.91 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీని ద్వారా 9.36 లక్షల ఎకరాలకు సాగు నీరందించడంతోపాటు హైదరాబాద్ నగరానికి తాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.6,616 కోట్లను వ్యయం చేస్తుండగా రిజర్వాయర్‌లో రెండు గ్రామాలతోపాటు ఐదు గిరిజన తండాలు ముంపునకు గురవుతున్నాయి. జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్, వల్లూరు గ్రామాలతోపాటు తుమ్మలకుంటతండా, రేగడి పట్టితండా, చిన్నగుట్టతండా, ఒంటిగుడిసెతండా, నవాబుపేట మండలం తీగలపల్లి పంచాయతీ పరిధిలోని సామగడ్డతండాలు రిజర్వాయర్‌లో మునిగిపోనున్నాయి. అయితే తరతరాల నుంచి పుట్టి పెరిగిన ఆయా గ్రామాలను ఉన్న ఫలంగా ఖాళీ చేసే పరిస్థితులు నెలకొన్నాయి.

నిర్వాసితులు ఇలా..

ఉదండాపూర్ రిజర్వాయర్‌లో ఇప్పటి వరకు 2,075 కుటుంబాలు నిర్వాసితులు అవుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో ఉదండాపూర్‌కు సంబంధించి 1,039 నిర్మాణాలు మునిపోనుండగా 1,34,844 చ.గ., భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఫలితంగా 1,350 కుటుంబాలు నిరాశ్రయులుగా మారాయి. అలాగూ వల్లూరుకు సంబంధించి 358 నిర్మాణాలు మునగనుండగా 63,457 చ.గ., భూమి స్వాధీనంతో 605 కుటుంబాలు, తుమ్మలకుంటతండాలో 84 నిర్మాణాలు మునుగుతుండగా 12,550 చ.గ., భూమిని స్వాధీనం చేసుకుంటే 120 కుటుంబాలు ఆవాసం కోల్పోనున్నాయి.

ఒకే దగ్గర పునరావాసం

ముంపునకు గురవుతున్న గ్రామాలు, తండాల వారికి కలిపి ఒకే దగ్గర పునరావాసం కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం జడ్చర్ల– పోలేపల్లి శివారులో గల దేవునిగుట్టతండా వద్ద భూములు గుర్తించి పునరావాస ప్రక్రియ మొదలుపెట్టారు. పునరావాసానికి గాను 316 ఎకరాల భూమిని గుర్తించగా.. ఇందులో 76 ఎకరాలు పట్టాదారుల నుంచి, మిగతా 240 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. అయితే వల్లూరు, ఉదండాపూర్ గ్రామాలకు సంబంధించి సరిహద్దులను గుర్తించి ప్లాట్లను కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే కులాలు, మతాల వారిగా ప్లాట్ల కేటాయింపు ఉంటుందా అనేది ఆయా గ్రామస్తుల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకునేలా అధికారులు ఆలోచిస్తున్నారు. పునరావాస ప్రక్రియలో భాగంగా ఎత్తుపల్లాలను చదును చేయగా.. సీసీ రోడ్డు, డ్రైయినేజీ, విద్యుత్ సరఫరా, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

తక్కువగా పరిహారం

రిజర్వాయర్ పరిధిలో సేకరించిన భూములకు ప్రభుత్వం అతి తక్కువ పరిహారం చెల్లించింది. ఇక్కడ ఎకరాకు రూ.5.50 లక్షలు, సాగునీటి వనరులున్న భూమికి ఎకరాకు రూ.6.50 లక్షలు మాత్రమే పరిహారం చెల్లించింది. అయితే బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ.30– 50 లక్షలకు పైగానే ధరలు ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు. మానవతా దృక్పథంతో తమకు అదనంగా పరిహారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీనికితోడు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదు.

గడువులోగా కష్టమే..

ఈ ఏడాది సెప్టెంబర్ నెలాఖరులోగా ఉదండాపూర్ రిజర్వాయర్‌ను కృష్ణా జలాలతో నింపుతామని పాలకులు ప్రకటించినా ఆలోగా పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటి వరకు కేవలం 60– 70 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయి. ఒకవేళ రిజర్వాయర్ పనులు పూర్తిచేసినా పునరావాస ప్రక్రియ నత్తనడకన సాగుతుండటంతో నిర్వాసితులను తరలించే పరిస్థితి లేదు. ఇటు రిజర్వాయర్ పనులతోపాటు అటు పునరావాస పనులు ఏకకాలంలో పూర్తయితే తప్ప రిజర్వాయర్‌లో నీటిని నింపే అవకాశమే లేదు.

రిజర్వాయర్ సామర్థ్యం 15.91 టీఎంసీలు	అందనున్న సాగునీరు 9.36 లక్షల ఎకరాలు	వెచ్చించిన నిధులు రూ.6,616 కోట్లు
ముంపునకు గురవుతున్న గ్రామాలు, తండాలు 7	నిర్వాసిత కుటుంబాలు 2,075	సేకరించిన భూమి 4,585 ఎకరాలు

రూపాయి కూడా రాలే..



ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి తాము సంతకాలు చేసి ఐదు నెలలు అవుతుంది. బ్యాంకు ఖాతాలలో మూడు దఫాలుగా పరిహారాన్ని జమ చేస్తామని అధికారులు అప్పట్లో చెప్పారు. ఇప్పటి వరకు రూపాయి కూడా చేతికి అందలేదు. అధికారులు స్పందించి త్వరగా పరిహారం అందజేయాలి.

– హన్మంతు, నిర్వాసితుడు, ఉదండాపూర్

పనులు జరుగుతున్నాయి..




ఉదండాపూర్ పునరావాస ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటికే ఇంటి స్థలాల విభజన, రోడ్లు, డ్రైయినేజీ, విద్యుత్ లైన్ల నిర్మాణాలు వేగవంతం అయ్యాయి. అన్నిరకాల మౌలిక సదుపాయాలతో నిర్వాసితులకు పునరావాసం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– లక్ష్మీనారాయణ, తహసీల్దార్, జడ్చర్ల

క్లుప్తంగా...

అవినాశ్‌రెడ్డి బెయిలు రద్దుపై విచారణ వాయిదా

- 3కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు
- కౌంటర్ల దాఖలుకు అవినాశ్, సీబీఐకి నోటీసులు



సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకా నందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి ముందస్తు బెయిలు రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. వివేకా కుమార్తె సునీత దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ విచారించింది. సునీత తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు విని పిస్తూ.. వివేకా హత్య తదనంతర పరిణామాలు, సీబీఐ దర్యాప్తు ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు బదిలీ కావడం వంటి అంశాలను న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ఈ నెల 30 నాటికి దర్యాప్తు పూర్తి చేయాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించిందని ఆయన గుర్తు చేశారు. అనంతరం తదుపరి విచారణను వచ్చే నెల 3కు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. అప్పటికల్లా కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులైన అవినాశ్ రెడ్డి, సీబీఐలకు నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుంచి ఆదేశాలు తీసుకొని సీజేఐ ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌తో ఈ పిటిషన్‌ను కూడా జత చేసి జూలై 3న జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని కోర్టు ఆదేశించింది.

బీఆర్‌ఎస్‌లోకి మహారాష్ట్ర నేతలు

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలోని పలు పార్టీలకు చెందిన నాయకులు, ప్రముఖులు బీఆర్‌ఎస్ అధినేత సీఎం కేసీఆర్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వారిలో బీడ్ జిల్లా బీజేపీ కార్యదర్శి మయూరి ఖేడ్కర్, ఔరంగాబాద్ జిల్లా ఎన్సీపీ కార్యదర్శి సతీష్ బచాటే, పుణే విధానసభ మాన్సే అధ్యక్షుడు చంద్రకాంత్ సిమ్లా, పుణే మాన్సే యువక్ ఆఘాడీకి చెందిన కళ్యాణ్ కుమార్, చిరంజీవి రాంరావు, జై భగవాన్ మహాసంఘ్ యువ తాలూకా అధ్యక్షుడు పరమేశ్వర్ కేదార్, సర్పంచ్‌లు మహాదేవ్ జవహరే, శరద్ సిర్సాట్, సంజయ్ కేదార్, గణేష్ జయభాయే, భగవాన్ జయభయే, విష్ణు సనప్, సంతోష్ బడే, అర్బాజ్ షేక్ తదితరులున్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు మాణిక్ కదమ్ తదితరులున్నారు.

నా‘నో’ యూరియా!



లిక్విడ్ యూరియా వాడకంపై ఆసక్తి చూపించని రైతులు

- అర లీటర్ నానో యూరియా 45 కేజీల సాధారణ యూరియాతో సమానం
- భూసార పరిరక్షణ.. ధర తక్కువ..పంటల దిగుబడి ఎక్కువ
- అవగాహన కార్యక్రమాలకు సిద్ధమవుతున్న వ్యవసాయ అధికారులు

భూసారం దెబ్బతినదు. ధర తక్కువ.. లాభాలు కూడా ఎక్కువ. ఇలాంటి ప్రయోజనాలెన్నో ఉన్నా, నానో యూరియా వినియోగంపై రైతులు ఆసక్తి చూపించడం లేదు. నానో యూరియా వ్యవసాయ రంగంలోనే కొత్త విప్లవానికి నాంది అని ప్రభుత్వం, వ్యవసాయశాఖ చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం దానికి ఆశించినంతగా ఆదరణ లభించడం లేదు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ వర్గాలు విఫలం కావడమే ఈ పరిస్థితికి కారణమనే విమర్శలు విన్పిస్తున్నాయి.

- సాక్షి, హైదరాబాద్

లాభాలు ఎక్కువంటున్న శాస్త్రవేత్తలు

కేవలం అర లీటర్ లిక్విడ్ యూరియా (నానో).. 45 కేజీల సాధారణ యూరియాతో సమానం. సాధారణ ఘన రూపంలోని యూరియా కంటే నానో లిక్విడ్ యూరియాతో లాభాలు ఎక్కువ ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అలాగే ప్రస్తుతం రైతులు వినియోగిస్తున్న యూరియాతో భూమికి హాని జరగడంతో పాటు భూసారం తగ్గుతోందని పలు నివేదికలు తెలుపుతున్నాయి. దీంతో పాటు 45 కిలోల బరువుండే యూరియా బస్తాను ఎరువుల దుకాణం నుంచి పొలం వరకు తీసుకెళ్లడం వ్యయ ప్రయాసలతో కూడుకున్న వ్యవహారం. ఈ నేపథ్యంలో యూరియా వాడకాన్ని తగ్గిస్తూ, భూసారాన్ని దెబ్బతీయకుండా ఉండడంతో పాటు ఘన యూరియాతో పోల్చితే లాభాలు అధికంగా వచ్చేలా నానో యూరియా రూపుదిద్దుకుంది. అయితే దీనిపై రైతులు గందరగోళంలో ఉన్నారు. సాధారణ యూరియాకు అలవాటు పడడం వల్ల కూడా రైతులు నానో యూరియాను వినియోగించడానికి అంతగా ఆసక్తి చూపించడంలేదని తెలుస్తోంది.

అవగాహన కల్పిస్తామంటున్న అధికారులు

నానో యూరియాపై రైతు వేదికల ద్వారా రైతులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తక్కువ ధర, అధిక దిగుబడి లాంటి అంశాలను రైతుల్లో ముమ్మర ప్రచారం చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించామన్నారు. ముందుగా రాష్ట్ర స్థాయిలో పలువురు రైతులతో అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, తర్వాత క్షేత్రస్థాయిలో పొలాలు, రైతు వేదికల వద్ద సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత వానాకాలం వ్యవసాయ సీజన్‌లో 8 లక్షల బాటిళ్ల నానో యూరియాను రైతులకు అందజేయాలని వ్యవసాయ శాఖ ఎరువుల ప్రణాళికలో ప్రకటించింది.

రూ. 60 తక్కువ..

500 ఎంఎల్ నానో యూరియా బాటిల్‌లో 40 వేల పీపీఎంల నైట్రోజన్ ఉంటుంది. లిక్విడ్ యూరియాను నీటిలో కలిపి పిచికారీ చేస్తే సరిపోతుంది. ఈ యూరియాను పత్తి, మొక్కజొన్న తదితర 94 పంటల మీద పిచికారీ చేయొచ్చు. కాగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న సంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియా తక్కువ ధరకు లభిస్తుంది. అంతే కాదు దీని వాడకం వల్ల పంట దిగుబడి సాధారణ యూరియా కంటే 8% పెరుగుతుందని అంచనా. సబ్సిడీలు పోనూ యూరియా బస్తా ధర రూ.266 ఉండగా... నానో యూరియా బాటిల్ రూ.204కే లభిస్తోంది. అర లీటర్ నానో యూరియాకు సుమారు 127 లీటర్ల నీటిని కలిపి చల్లొచ్చు. రవాణాకు, నిల్వకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అయినా చాలావరకు రైతులు ఆసక్తి చూపించక పోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ఫెర్టిలైజర్ షాపు యజమానులు 4 యూరియా బస్తాలు కొనుగోలు చేసిన రైతులకు నానో లిక్విడ్ యూరియాను బలవంతంగా అంటగడుతున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.

‘ఉపా’ను రాష్ట్రంలో ప్రయోగించబోమని ప్రకటించాలి

- కేంద్రంలో కూడా ఎత్తేసేలా ప్రయత్నించాలి
- రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలి: ప్రొ.హరగోపాల్



పంజగుట్ట: ఉపా చట్టాన్ని రాష్ట్రంలో ఉపయోగించబోమనీ, కేంద్రంలోనూ ఎత్తేసేలా ప్రయత్నిస్తామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించాలని నిర్బంధ వ్యతిరేక వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ కోరారు. ఇక్కడి ప్రజలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా బతకవచ్చు.. ఇది ప్రజాస్వామ్య తెలంగాణ అని నిరూపించుకోవాలి అని సూచించారు. ప్రజాసంఘాల స్వేచ్ఛను, మాట్లాడే హక్కును దూరం చేస్తున్న అన్యాయమైన ఉపా చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల ఉపా చట్టం కేసులను ఆరుగురిపై రాష్ట్ర ప్రభుత్వం ఎత్తేసిన సంగతి తెలిసిందే. ఆ ఆరుగురిలో నలుగురు ప్రొఫెసర్ హరగోపాల్, పద్మజాషా, పౌరహక్కుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రొఫెసర్ గుంట రవి సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ .. తమపై నమోదైన కేసులే మిగిలిన 146 మందిపై కూడా ఉన్నప్పుడు వారిపై కేసులు ఎందుకు ఎత్తివేయలేదని ప్రశ్నించారు.

21 నుంచి దశల వారీ ఆందోళన

తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 21 నుంచి 25 వరకు సీఎం, మంత్రులకు వినతిపత్రాలు ఇస్తామని, జూన్ 26 నుంచి జూలై 29 వరకు జిల్లాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు, సెమినార్లు నిర్వహిస్తామని, జూలై 30న హైదరాబాద్‌లో ప్రజాస్వామిక వాదులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో బహిరంగ సభ నిర్వహిస్తామని హరగోపాల్ తెలిపారు.

దేవేందర్‌ను విడుదల చేయాలి

సిద్దిపేటలో పరీక్ష రాస్తుండగా పోలీసులు అరెస్టు చేసి తీసుకువెళ్లిన దేవేందర్‌ను బేషరతుగా విడుదల చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. దేవేందర్ గతంలో దేశభక్త ప్రజాతంత్రలో పనిచేసింది వాస్తవమే అయినా ఇప్పుడు దానికి దూరంగా ఉన్నాడని తెలిపారు. అరెస్టు చేసి 24 గంటలు అవుతున్నందున వెంటనే కోర్టులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

బంగాళాఖాతంలో కలిసేది బీఆర్‌ఎస్సే

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం వస్తుందన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా సోమవారం రాత్రి నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని మెయిన్ సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో భట్టి ప్రసంగించారు. రాష్ట్రంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఎందుకోసం నిర్వహిస్తున్నారని.. ప్యాలెస్ లాంటి ఫామ్‌హౌజ్‌లు కట్టుకున్నందుకా, వేల కోట్లు సంపాదించుకున్నందుకా అని ప్రశ్నించారు. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం లేకుండా చేస్తున్న బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడేందుకు, సమస్త తెలంగాణ ప్రజల కోసం తాను పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేస్తున్నానని చెప్పారు. ధరణి వల్ల భూమిపై హక్కులు కోల్పోయిన వారికి చట్టబద్ధంగా హక్కులు కల్పిస్తామన్నారు.

కృష్ణా జలాలను నల్లగొండకు తరలించాలి

తనది గమ్యం లేని పాదయాత్ర అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అంటున్నారని.. కృష్ణా జలాలను నల్లగొండ జిల్లాకు తరలించాలనేదే తన ఆశయమన్న విషయం గుత్తా తెలుసుకోవాలని భట్టి సూచించారు. చెమట బిందువులను ఓట్లుగా మార్చి నకిరేకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే.. ఆ ఎమ్మెల్యే ప్రలోభాలకు లోనై పార్టీ మారాడని విమర్శించారు. బ్రాహ్మణ వెల్లెంల, ఉదయ సముద్రం ప్రాజెక్టు గురించి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అప్పట్లోనే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తెచ్చారని.. అప్పట్లో కాంగ్రెస్ సర్కారు రూ.348 కోట్లను ప్రాజెక్టుకోసం ఖర్చుపెట్టిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పీసీసీ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్, ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్‌లో అసెంబ్లీ షెడ్యూల్!

▶ మొదటి పేజీ తరువాయి

బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని వివరించాయి. ఈ మేరకు 74 మంది డిప్యూటీ కలెక్టర్లు (ఇటీవలే పదోన్నతి పొందిన వారితో కలిపి), 14 మంది డిప్యూటీ కమిషనర్లు, 31 మంది అదనపు కలెక్టర్లను సిద్ధం చేయనున్నట్టు సమాచారం. ఇక అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోనికి వచ్చే అన్ని మండలాల తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించనున్నట్టు తెలిసింది.

ఏఆర్‌వోల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి ఏర్పాట్లు

నామినేషన్ల ప్రక్రియతోపాటు పోలింగ్ సామగ్రి సమకూర్చుకోవడం, పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, ఈవీఎంలు, బ్యాలెట్ పేపర్లు సిద్ధం చేయడం, పోలింగ్ స్టేషన్లలో కనీస సౌకర్యాల కల్పన వంటి ఏర్పాట్లన్నీ ఏఆర్‌వోల పర్యవేక్షణలో జరగనున్నాయి. ప్రస్తుతం ఓటర్ల జాబితా తయారీలో భాగంగా అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ (ఏఈఆర్‌వో) అధికారులుగా తహసీల్దార్లు పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 4న ఓటర్ల తుది జాబితా ప్రచురణ ఉండటంతో, ఆ తర్వాతే షెడ్యూల్ వస్తుందని రెవెన్యూ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు మార్చి 5–15వ తేదీ మధ్య షెడ్యూల్ వచ్చే అవకాశం ఉందని చెప్తున్నాయి.

2018లో ముందస్తు ఎన్నికలతో..

గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు లోక్‌సభ ఎన్నికలతోపాటు 2019 ఏప్రిల్–మే నెలల్లో జరగాలి. కానీ రాష్ట్రంలో రాజకీయ కంగాళీ వాతావరణం ఏర్పడిందని.. తనను, ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని పేర్కొంటూ.. సీఎం కేసీఆర్ ముందస్తు ఎన్నికలకు వెళ్లారు. 2018 సెప్టెంబర్ 6న ప్రభుత్వాన్ని రద్దు చేస్తూ కేబినెట్‌లో తీర్మానించి.. అప్పటి గవర్నర్‌ను నరసింహన్‌కు అందజేయడం, ఆయన వెంటనే ఆమోదించడం, అదే రోజున 105 మంది బీఆర్‌ఎస్ అభ్యర్థులను కేసీఆర్ ప్రకటించడం చకచకా జరిగాయి. అప్పుడు దేశంలో మరో నాలుగు రాష్ట్రాలకూ ఎన్నికల సమయం కావడంతో.. వాటితో పాటు తెలంగాణనూ కలిపి అక్టోబర్ 6న ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. నవంబర్ 12న నోటిఫికేషన్ జారీకాగా డిసెంబర్ 7న పోలింగ్, 11న ఓట్ల లెక్కింపు జరిగాయి. ఆ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మెజారిటీ సీట్లు గెల్చుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

ఈసారి అదే సమయంలో..!

ఈసారి కూడా ఆ నాలుగు రాష్ట్రాలతో కలిపి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు చెప్తున్నాయి. 2018లో జరిగిన 5 రాష్ట్రాల్లో ఎన్నికల్లో భాగంగా.. ఛత్తీస్‌గఢ్‌లో నవంబర్ 12, 20 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరిగింది. మధ్యప్రదేశ్, మిజోరం రాష్ట్రాల్లో నవంబర్ 28న, రాజస్తాన్, తెలంగాణ రాష్ట్రాల్లో డిసెంబర్ 7న పోలింగ్ నిర్వహించారు. ఈసారి కూడా ఐదు రాష్ట్రాల పోలింగ్ ప్రక్రియ డిసెంబర్ 5–9 తేదీల మధ్య ముగిసే అవకాశాలు ఉన్నాయని.. ఇందుకు అనుగుణంగా అక్టోబర్ రెండో వారంలోనే షెడ్యూల్ రావొచ్చని అధికార వర్గాలు చెప్తున్నాయి.

మరికొందరు కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ?

సాక్షి, హైదరాబాద్: ఇంటర్, డిగ్రీ కాలేజీల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న మరికొంత మంది అధ్యాపకులను క్రమబద్ధీకరించే అవకాశాలున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వానికి పంపించనున్నారు. మే, జూన్ నెలల్లో ఇంటర్, పాలిటెక్నిక్ కళాశాల విద్యాబోధనలో ఉన్న 3,897 కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. ఇప్పుడు వారంతా రెగ్యులర్ ఉద్యోగులైపోయారు. అయితే సరైన అర్హతలు లేనికారణంగా కొంతమందిని క్రమబద్ధీకరించలేదు. కొంతమంది డిస్టెన్స్‌లో డిగ్రీ చదివినవాళ్లు, రాష్ట్రంలోని బయటి రాష్ట్రాల స్టడీ సెంటర్లలో చదివినవారూ ఉన్నారు. వీరేకాకుండా కొన్ని పోస్టుల మంజూరు లేకుండా లెక్చరర్లను నియమించారు. మరికొన్ని చోట్ల మంజూరైన పోస్టు సబ్జెక్టు ఒకటయితే.. మరో సబ్జెక్టు బోధించే అధ్యాపకులు పని చేస్తున్నారు. డిగ్రీ కాలేజీ అధ్యాపకులకు నెట్, సెట్, పీహెచ్‌డీ తప్పనిసరి కాగా, ఈ అర్హతలు లేని వారిని నియమించారు. అయితే తాజాగా ఈ అర్హతలను సాధించడంతో వీరందరి వివరాలను ఆయా శాఖల అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు. ప్రభుత్వం ఆమోదిస్తే, వీరిని సైతం క్రమబద్ధీకరించే అవకాశాలున్నట్లుగా విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.

నవోదయ జాతీయ అధ్యక్షుడిగా భాస్కరచారి



బిజినేపల్లి: అఖిల భారత నవోదయ విద్యాలయ సమితి స్టాఫ్ అసోసియేషన్ 8వ జాతీయ సదస్సులో సోమవారం నిర్వహించిన సమావేశంలో వట్టెం జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన వడ్ల భాస్కరచారి అసోసియేట్ జాతీయ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. జాతీయ కార్యవర్గంలో తెలంగాణ రాష్ట్రం నుంచి జాతీయ అధ్యక్షులుగా కోవి మంజుల ఎంపిక కాగా, అందులో తనకు స్థానం కల్పించడంపై భాస్కరాచారి హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా భాస్కరచారి మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం కోసం నవోదయ కార్మికుల డిమాండు న్యాయమైనదని, అందుకు సంఘం తరఫున పోరాడుతామని అన్నారు.

జేపీఎన్‌సీలో డ్రోన్ టెక్నాలజీపై వర్క్‌షాప్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జయప్రకాశ్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం డ్రోన్ టెక్నాలజీపై వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఈమేరకు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఐటీడీఎం డీవీఎల్ఎన్ సోమయాజులు ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. శిక్షణలో భాగంగా విద్యార్థులు డ్రోన్‌ల తయారీ, విడిభాగాల అమరిక, పనిచేసే విధానం వంటి అంశాలపై అవగాహన పెంచుకుంటారని తెలిపారు. డ్రోన్ విధానం పలురంగాల్లో విస్తృతంగా వినియోగిస్తున్నారని, మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానంలో ప్రత్యేక స్థానాన్ని కల్పించిందని, దీంతో మరింత ప్రాధాన్యత సంతరించుకోనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రవికుమార్, కార్యదర్శి వెంకటరామారావు, ప్రిన్సిపాల్ సుజీవన్, ఐఐటీ కర్నూల్ ప్రొఫెసర్ సత్యబాబు, కృష్ణనాయక్, ఈశ్వర్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష

దామరగిద్ద: మహిళను వేధించిన కేసులో ఎస్ఐ నవీన్ సింగ్ 2015 సెప్టెంబర్ 14న కేసు నమోదు చేశారు. సీనియర్ సివిల్ జడ్జి పర్విన బేగం విచారణ అనంతరం సోమవారం శిక్ష విధించినట్లు ఎస్ఐ శ్రీనివాస్ రావ్ తెలిపారు. ఆటో డ్రైవర్‌గా అంజిలప్పకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు చెప్పారు.

రసాభాసగా ప్రజాహిత సదస్సు

- బీఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్, బీజేపీ
- పోలీసుల రంగప్రవేశం
- అర్ధంతరంగా నిలిచిన సదస్సు
- వెనుదిరిగిన నిర్వాహకులు



బీజేపీకి చెందిన సాహితితో వాగ్వాదం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జడ్చర్ల: జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధిపై తెలంగాణ ప్రజల అభివృద్ధి అజెండా(టీ–పాడ్) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఇంపీరియల్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సదస్సు రసాభాసగా మారి అర్ధంతరంగా ముగిసింది. అరుపులు, కేకల మధ్య పోలీసులు రంగప్రవేశం చేయడంతో నిర్వాహకులు సదస్సును నిలిపివేసి వెనుదిరిగి వెళ్లిపోయారు. టీ–పాడ్ చైర్మన్ ప్రొఫెసర్ తిరుపతిరావు, కన్వీనర్ డాక్టర్ శ్రీరాములు సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సదస్సుకు బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, తదితర పార్టీలకు చెందిన నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు హాజరయ్యారు. జడ్చర్ల నియోజకవర్గం అభివృద్ధికి సంబంధించి సమస్యలు తదితర అంశాలను సదస్సు దృష్టికి తీసుకొస్తే తాము ప్రాంతీయ, జాతీయ స్థాయిలో వాటిని చర్చించేలా ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా నిర్వాహకులు వివరించారు.

కార్యక్రమాలను వివరిస్తుండగా..

స్థానిక వార్డు కౌన్సిలర్ లత మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తుండగా.. ఒక్కసారిగా కాంగ్రెస్, బీజేపీ నాయకులు అడ్డు తగిలారు. సమస్యలు వివరించకుండా ప్రభుత్వ పథకాల గురించి చెప్పడం తగదని ఒక్కసారిగా ఎగబడ్డారు. అనంతరం నిర్వాహకులు అందరికి సర్ది చెప్పి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన సమస్యలు, కావాల్సిన పనులకు సంబంధించి సూచనలు చేయాలని విజ్ఞప్తి చేయడంతో కొంత సమయం గొడవ సద్దుమణిగింది. తదుపరి సామాజిక వేత్త అనిల్‌కుమార్ జడ్చర్లకు బైపాస్ రోడ్డు, రైల్వే బ్రిడ్జి విస్తరణపై స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కాంగ్రెస్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డి కావేరమ్మపేటకు రైల్వే స్టేషన్ కావాలని సూచించారు.



నిర్వాహకులతో వాగ్వాదానికి దిగిన నాయకులు

బీజేపీకి చెందిన సాహితీ మాట్లాడుతూ..

జడ్చర్లలో 220 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు తక్కువ పరిహారం ఇచ్చారని, వారికి మెరుగైన పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చెప్పడంతో మూడా డైరెక్టర్ శ్రీకాంత్ ఆమె ప్రసంగాన్ని అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీఆర్‌ఎస్ నాయకులు ఒక్కసారిగా ముందుకు దూసుకొచ్చి ఆమెతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆమెకు మద్దతుగా బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు, క్యాకర్తలు బీఆర్‌ఎస్ నాయకులపై మండిపడ్డారు. ఇరువర్గాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు చోటుచేసుకుని ఘర్షణ వాతావరణాన్ని తలపించింది. దీంతో ఎస్ఐలు లెనిన్, ఖాదర్ ఆధ్వర్యంలో పోలీసులు రంగప్రవేశం చేసి వారిని శాంతపరిచే చర్యలు చేపట్టారు. నిర్వాహకులు పలు సూచనలు చేసినా పట్టించుకోకపోవడంతో వారు సదస్సును రద్దు చేసుకుని వెనుదిరిగి వెళ్లిపోయారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రణీల్, కౌన్సిలర్లు ప్రశాంత్, జ్యోతి, చౌహాన్, బీజేపీకి చెందిన కౌన్సిలర్ రాజు, నాగరాజు, మినాజ్, వంశీ, ఖదీర్, బాలవర్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేక తప్పుడు విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలు



జడ్చర్ల డీటీసీలో మొక్కలు నాటుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: రాష్ట్రంలో ప్రతిపక్షాలకు తాము చేసిన అభివృద్ధి, సంక్షేమం కనిపించడం లేదని వారికి కంటి చికిత్సలు చేయించినా పొరలు కమ్మాయని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విపక్షాలపై మండిపడ్డారు. సోమవారం జడ్చర్ల శివారులోని డీటీసీలో హరిత హారం కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కలెక్టర్ రవినాయక్, ఎస్పీ నర్సింహ తో కలసి పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ విపక్ష నేతలు గజనీల వ్యవహరిస్తున్నారని అన్నారు. ఓర్వలేక తప్పుడు విమర్శలకు దిగుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామని, హ రిత హారంలో ముందున్నామని, విద్యుత్ సరఫరా, రైతుబంధు, దళితబంధు, తండాలను గ్రామ పంచాయతీలుగా చేయడం వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. వైద్యరంగంలో గణనీయమైన అభివృద్ధి సాధించామన్నారు. తాము అభివృద్ధి చేయకపోతే తెలంగాణకు ఉత్తమ అవార్డులు ఎందుకు వస్తాయని ప్రశ్నించారు. పాలమూరు జిల్లాను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. యాసంగి సీజన్‌లో దేశంలోనే సగ భాగం ధాన్యం పండించామంటే పరిస్థితిని అంచనా వేయాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి జిల్లాను కాపాడుకుంటామని అన్నారు. జిల్లాలో గురుకులాలను ఏర్పాటు చేశామని, హైదరాబాద్ తరువాత జిల్లాను నంబర్ వన్ చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతిపక్షాలకు ప్రజలే సరైన సమయంలో గుణపాఠం చెబుతారని వివరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, జెడ్పీ సీఈఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయంలో పూడికతీత



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పట్టణంలోని జోగుళాంబ వాగు సమీపంలో నివాస గృహాల మధ్య ఉన్న అతిపురాతన శివాలయం చాలా కాలంగా మట్టిలో కూరుకుపోయింది. దీంతో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగమద్దిలేటి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జితేందర్‌గౌడ్, కౌన్సిలర్ లక్ష్మీదేవి, పలువురు కలిసి సోమవారం పూడికతీత పనులు ప్రారంభించారు. కాగా కోటి లింగాలకు ప్రతీకమైన క్షేత్రంగా చెబుతున్న పట్టణంలో చాలా వరకు వేలాది ఆలయాలు భూగర్భంలో కలిసిపోయాయి. ఎక్కడ తవ్వినా ఆలయాలకు సంబంధించిన ఎర్ర ఇసుకరాతి, ఆలయ ఆనవాళ్లు, చిన్నపాటి సొరంగాలు బయట పడటం గతంలో కూడా చోటు చేసుకున్నాయి.

విద్వేషాలకు వ్యతిరేకంగా రాహుల్ జోడోయాత్ర

- వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్‌దే అధికారం
- రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న శివసేనారెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశంలో విద్వేషాలకు వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ భారత్‌జోడోయాత్ర చేపట్టినట్లు రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి అన్నారు. జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హక్ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక బోయపల్లి రెవెన్యూ వార్డులో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న శివసేనారెడ్డి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్రలో పేదల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. నిరుద్యోగులకు అన్ని విధాలుగా కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హక్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ 53వ జన్మదినం సందర్భంగా 53 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. దేశంలోని యువతకు రాహుల్ స్ఫూర్తి అని అన్నారు. భవిష్యత్తులో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. అనంతరం శివసేనారెడ్డి పలువురు రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, ప్రధాన కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, మాజీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, వాసుయాదవ్, వసంత, సాయిబాబా, లింగంనాయక్, ఎండీ సల్మాన్, బెక్కరి అనిత, తదితరులు పాల్గొన్నారు.

పాత ఆస్పత్రి భవనంలోనూ వైద్యం



ఆస్పత్రి పాతభవనాన్ని పరిశీలిస్తున్న సోమశేఖర్, శివకాంత్

- సాధారణ ఓపీలు మాత్రమే అందుబాటులోకి..
- ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులతో మధ్యాహ్నం వరకు సేవలు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రి పాతభవనంలో తిరిగి వైద్య సేవలు ప్రారంభం కానున్నాయి. గంగాపురం రోడ్‌లో నూతనంగా నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని మే 27న మంత్రి హరీశ్ రావు ప్రారంభించిన విషయం తెలిసిందే. నూతన ఆస్పతి భవనం ప్రారంభం కావటంతో గత నెల 29 నుంచి పూర్తిస్థాయి వైద్య సేవలు అక్కడే అందుబాటులోకి తీసుకొచ్చారు. కొత్త భవనం పట్టణానికి దూరంగా ఉండటంతో సాధారణ రోగులు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా పాతబజార్, సంజీవయ్య కాలని, నిమ్మబావిగడ్డ, శ్రీరాంనగర్, శాంతినగర్, గంజ్ ప్రాంతం, శివాజీనగర్, మున్సిపాలిటీ పరిధిలోని నాగసాల, బూరెడ్డిపల్లి గ్రామాల ప్రజలు నూతన భవనానికి వెళ్లలేకపోతున్నారు. అలాగే పట్టణానికి వివిధ కారణాలపై వచ్చి పనులు ముగించుకుని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చే వారు సైతం నూతన భవనానికి వెళ్లేందుకు కష్టంగా మారింది. వీటిని దృష్టిలో ఉంచుకుని స్థానిక ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి పాతభవనంలోనూ వైద్య సేవలు తీసుకొస్తామని ఈ నెల 14న జరిగిన వైద్య ఆరోగ్యశాఖ ప్రగతి సభలో వెల్లడించారు. ఆయన ఆదేశాల మేరకు ఆదివారం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.సోమశేఖర్, అర్బన్‌హెల్త్ సెంటర్ డా.శివకాంత్ పాత భవనాన్ని సందర్శించారు. అక్కడ సాధారణ ఓపి సేవలు ప్రారంభించేందుకు అవకాశాలను పరిశీలించారు.

మధ్యాహ్నం నుంచి నూతన భవనంలో..

బస్తీ దవాఖానాలకు నియమితులైన ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు ఇద్దరిని పాతభవనంలో ఓపీ సేవలు అందించేందుకు నిర్ణయించారు. రెండు రోజుల్లో ఓపీ సేవలు ప్రారంభించేలా చర్యలు తీసుకోనున్నారు. డాక్టర్లతో పాటు అవసరమైన సిబ్బంది, మందులు అందుబాటులో ఉంచాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. సోమశేఖర్, అర్బన్‌హెల్త్ సెంటర్ డా.శివకాంత్ వెల్లడించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వైద్యులు అందుబాటులో ఉంటారని, మిగిలిన సమయాల్లో నూతన భవనానికే వెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.